# భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రై డే

- శిలువతో ర్యాలీలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



మంచిర్యాల ఏసీసీ : జిల్లా కేంద్రంలో శిలువతో యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

మంచిర్యాల ఏసీసీ, మార్చి 29: గుడ్ ఫ్రై డే ను పురస్కరించుకొని శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని చర్చిల్లో భక్తి శ్రద్ధలతో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి చౌరస్తాలో గల క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో శిలువ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని క్రైస్తవ భక్తులందరూ పాల్గొని ప్రార్థనలు చేశారు. బెల్లంపల్లి చౌరస్తా నుంచి లక్ష్మి థియేటర్ సర్కిల్ వరకు శిలువతో యాత్ర కొనసాగింది. అనంతరం బొక్కలగుట్ట లోని రక్షణ కొండపై ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయంలో ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఆదిలాబాద్ మిత్రాసనం పీఠాధిపతులు ప్రిన్స్ ఆంటోనీ దైవ సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్ జోష్ మణికేతన్, యోహాను, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

**నస్పూర్‌లో..**

సీసీసీ నస్పూర్, మార్చి 29: సీసీసీ నస్పూర్‌లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం మున్సిపల్ పరిధిలో చర్చిలకు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తును సిలువ వేసిన రోజును గుడ్ ఫ్రైడేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏసుక్రీస్తు త్యాగాలను స్మరించుకున్నారు.

**లక్షెట్టిపేటలో..**

లక్షెట్టిపేట, మార్చి 29: పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చిలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్లు భక్తులకు గుడ్ ఫ్రైడే విశిష్టతను భక్తులకు వినిపించారు. అనంతరం ఒకరికొకరు గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు.

**కోటపల్లిలో..**

కోటపల్లి, మార్చి 29 : గుడ్ ఫ్రైడే వేడుకలను కోటపల్లి మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోటపల్లి, షట్‌పల్లి, నాగపేట, కొల్లూరు, రొయ్యలపల్లి, బబ్బెరచెలుక గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భీమారంలో..

భీమారం, మార్చి 29 : మండల కేంద్రంలో గుడ్ ఫ్రైడే వేడుకలను స్థానిక క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక చర్చి నుంచి మొదలుకొని బస్టాండ్, ఆవుడం క్రాస్ రోడ్డు మీదుగా 14 స్థలాల్లో శిలువతో నిర్వహించిన యాత్రలో క్రైస్తవులతో పాటు మత కన్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫాదర్ జోబి మాట్లాడుతూ ఏసుక్రీస్తును శిలువ వేసిన ఈ రోజును క్రైస్తవులు గుర్తు చేసుకుంటూ గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. క్రైస్తవులు ఈ రోజును పవిత్ర దినంగా భావించి ఉపవాస ప్రార్థనలు చేస్తారని తెలిపారు.

**మందమర్రిలో..**

మందమర్రి, మార్చి 29: గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం మందమర్రి పట్టణంలోని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పలువురు యువతులు ఆలపించిన గేయాలు అలరించాయి. సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాస్టర్ రెవరెండ్ జెర్మియా పాల్గొని ఏసుక్రీస్తు త్యాగాలను వివరించారు.

**రామకృష్ణాపూర్‌లో..**

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 29: ఏసుక్రీస్తును శిలువ వేసిన రోజును గుర్తు చేసుకుంటూ గుడ్ ఫై డేను రామకృష్ణాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీఎస్ఐ సేయింట్ పీటర్స్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ రెవరెండ్ ఎం.జాషువా, అతిథి పాస్టర్ ఎం. ప్రశాంత్‌బాబు, మెదక్ డయాసిస్ ప్రొఫెషనల్ ఎడ్యుకేషనల్ కన్వీనర్, రామకృష్ణాపూర్ సీఎస్ఐ చర్చి సెక్రటరీ డొలకల డేవిడ్ దైవ సందేశాన్ని అందించారు. ఏసు క్రీస్తు మానవాళిపై చూపించిన ప్రేమ ఎంతో గొప్పదని విశ్వ మానవాళి శ్రేయస్సు కోసం క్రీస్తు తన ప్రాణాన్ని త్యాగం చేశాడని తెలిపారు. ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను ఈ సందర్భంగా ధ్యానించారు. సండే స్కూల్ పిల్లల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించగా చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక గీతాలను ఆలపించారు. పట్టణంలోని హెబ్రోన్, హల్లెలూయా, బెరకా, బెతేస్థ, బెతేలు, ప్రార్థన మందిరాలతో పాటు తిమ్మాపూర్‌లోని క్యాథలిక్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



కాసిపేట : సోమగూడెం కల్వరీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కన్నెపల్లిలో..

కన్నెపల్లి, మార్చి 29 : కన్నెపల్లి మండలంలోని ఏసయ్యపల్లెలో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు వేషధారణలో శిలువతో ర్యాలీ తీశారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కల్వరీ చర్చిలో..**

కాసిపేట, మార్చి 29 : సోమగూడెం, బెల్లంపల్లి రహదారి మధ్యలోని కల్వరీ మినిస్ట్రీస్ చర్చిలో గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో క్రైస్తవులు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిస్టర్ షారూన్ ఏసు జీవిత చరిత్రను, సందేశాలను వివరించి భక్తులను దీవించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.



భీమారం : శిలువ మోస్తున్న భక్తుడు



లక్షెట్టిపేట : సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



మందమర్రి : సీఎస్ఐ చర్చిలో..



రామకృష్ణాపూర్ : సీఎస్ఐ చర్చిలో..

## అవని హాస్పిటల్‌లో నవజాత శిశువులకు అరుదైన చికిత్స

- డాక్టర్ రుద్రభట్ల రఘువంశీ

మంచిర్యాల ఏసీసీ, మార్చి 29: తక్కువ బరువుతో జన్మించిన నవజాత శిశువులకు జిల్లా కేంద్రంలోని అవని హాస్పిటల్‌లో అరుదైన వైద్య చికిత్సను అందించి శిశువుల బరువును పెంచినట్లు హాస్పిటల్ డాక్టర్ రుద్రభట్ల రఘువంశీ తెలిపారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అవని హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘువంశీ మాట్లాడుతూ రెండు నెలల క్రితం కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాంకు చెందిన బీ.దీపికకు (575గ్రాముల బేబి), చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామానికి చెందిన మానసకు (800 గ్రాములతో బేబి) శిశువులు జన్మించారన్నారు. తక్కువ బరువుతో జన్మించడంతో తమ హాస్పిటల్‌కు తీసుకువచ్చారని తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించినట్లు చెప్పారు. ప్రస్తుతం దీపిక బిడ్డ బరువు 1.4కేజీ, మానస బిడ్డ బరువు 1.1 కేజీ బరువుకు వచ్చారన్నారు. తల్లులకు గర్భానికి సంబంధించిన సమస్యలు ఉండడం ద్వారా ఆరున్నర నెలల్లోనే పిల్లలు జన్మించారన్నారు. పుట్టిన పిల్లలిద్దరికీ ఊపిరితిత్తులు, ప్లేట్‌లెట్స్, జీర్ణవ్యవస్థ, తదితర సమస్యలున్నాయని, పీపీహెచ్, ఎన్ఈసీ, హెచ్‌ఎండీ ట్రీట్‌మెంట్ అందించి శిశువుల బరువును పెంచినట్లు తెలిపారు. ప్రస్తుతం పిల్లల ఆరోగ్యంగానే ఉన్నారని మరికాస్త బరువు పెరిగిన తరువాత డిశ్చార్జి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యుడికి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



నవజాత శిశువులతో వైద్యుడు, కుటుంబసభ్యులు, సిబ్బంది

## నాటుసారా పట్టివేత



నాటుసారా తయారీదారుడితో ఎస్ఐ రాజేందర్, సిబ్బంది

కోటపల్లి, మార్చి 28 : కోటపల్లి మండలం రాంపూర్ గ్రామంలో నాటుసారా తయారీదారుడిని పట్టుకున్నట్లు కోటపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దుర్కె శంకరయ్య చేనులో తనిఖీలు నిర్వహించగా నాటుసారా తయారు చేస్తూ పట్టుబడినట్లు వివరించారు. 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ వివరించారు.

## బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఎన్నిక

మంచిర్యాల ఏసీసీ, మార్చి 29: బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీని మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కట్ట పవన్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి సిరికొండ బోస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా మెరుగు నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పార్నంది రమేశ్ చంద్ర, జిల్లా కోశాధికారి స్వామికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన వాదాన్ని బలపర్చడానికి ప్రజలను చైతన్య పరుస్తూ వారి సమస్యలపై పోరాడుతామని పేర్కొన్నారు.

## నియామక పత్రం అందజేత



నియామక పత్రం అందుకుంటున్న వీ.మధుసూదన్ రెడ్డి

మంచిర్యాల ఏసీసీ, మార్చి 29: మంచిర్యాలకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సీనియర్ మెంబర్ వీ మధుసూదన్ రెడ్డిని రెడ్‌క్రాస్ తెలంగాణ రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడిగా కలెక్టర్, ఐఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు బదావత్ సంతోష్ నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం రెడ్‌క్రాస్ రాష్ట్రశాఖ కార్యదర్శి మదన్‌మోహన్ హైదరాబాద్‌లోని రాష్ట్ర శాఖ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందించారు. మూడేళ్ల పాటు కొనసాగనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాఖ అడ్మినిస్ట్రేషన్ అధికారి కోటిరెడ్డి పాల్గొన్నారు.

## వ్యసనాలకు బానిస కావద్దు

సిర్పూర్(టీ), మార్చి 29 : యువత వ్యసనాలకు బానిసై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ సూచించారు. శుక్రవారం చింతకుంట గ్రామంలో కౌటాల సీఐ సాదిక్‌పాషా, పోలీసు సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆన్‌లైన్, క్రికెట్ బెట్టింగ్‌లు పెట్టి డబ్బును వృథా చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించగా, ముగ్గురిపై మద్యం కేసు నమోదు చేసినట్లు సిర్పూర్(టీ) దీకొండ రమేశ్ పేర్కొన్నారు.

## మల్లంపేటలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు, గ్రామస్తులు

కోటపల్లి, మార్చి 29 : కోటపల్లి మండలం మల్లంపేట గ్రామానికి చెందిన కోండ్ర సుదర్శన్ తన యజమాని కుమారుడు బయ్య దీక్షిత్ జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు సల్పాల పోచం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ మార్గంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామస్తులన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సురేశ్, నాగన్న, రాజేందర్, విష్ణు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## పాపం పసివాళ్లు..

- ఆరు నెలల క్రితం తండ్రి..రెండ్రోజుల క్రితం తల్లి మృతి
- అనాథలైన చిన్నారులు
- మందమర్రిలో విషాదం



దహన సంస్కారాలు నిర్వహిస్తున్న చిన్న కుమారుడు

మందమర్రి, మార్చి 29: గతంలో ప్రమాదవశాత్తూ తండ్రి..రెండ్రోజుల క్రితం అనారోగ్యంతో తల్లి మరణించడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు. ఈ విషాద సంఘటన మందమర్రి పట్టణంలో జరిగింది. మందమర్రిలోని 12వ వార్డు రెండవ జోన్ కాలనీకి చెందిన పిట్టల శ్యామ్ భూమక్క దంపతులకు హర్థిక్(8), కార్తిక్(5) కుమారులున్నారు. ఆరు నెలల క్రితం కూలీ పనులకు వెళ్లిన శ్యామ్(40) ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. అప్పటి నుంచి భూమక్క ఇద్దరు పిల్లలను ఎలా పోషించాలనే బాధతో అనారోగ్యం పాలైంది. మెదడులో కణితి కావడంతో పలు దవాఖానల్లో చూపించినా నయం కాలేదు. 15 రోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చేరింది. ఆపరేషన్ చేసినా ఫలితం లేక గురువారం రాత్రి మరణించింది. తల్లిదండ్రులిద్దరూ మరణించడంతో చిన్నారులు అనాథలయ్యారు. తల్లి మృత దేహం వద్ద పిల్లలు రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. కనీసం దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేక పోవడంతో స్థానికులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు విరాళాలు సేకరించి అందజేశారు. చిన్న కుమారుడు కార్తిక్ రోదిస్తూ తల్లికి దహన సంస్కారాలు నిర్వహించాడు. అభం శుభం తెలియని చిన్నారులు తల్లి మృతదేహం వద్ద రోదిస్తూ అంతిమ సంస్కారాలు నిర్వహించడం కలచి వేసింది. సోపతి సొసైటీ సభ్యులు సేకరించినరూ.13 వేల విరాళాన్ని అందజేశారు. అమ్మమ్మ వద్ద ఉంటున్న చిన్నారులను ఆర్థిక సాయం చేసి అందించి ఆదుకోవాలని దాతలను కాలనీ వాసులు కోరారు.



చిన్నారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

# కాగజ్‌నగర్ గడ్డ..సట్టా మట్కా అడ్డా!

- పట్టణంలో విచ్చలవిడిగా మట్కా
- అరికట్టడంలో విఫలమవుతున్న పోలీసులు
- చాపకింద నీరులా జూదం
- అత్యాశతో అమాయకుల జేబుగుల్ల

కాగజ్‌నగర్, మార్చి 29: కాగజ్‌నగర్ పట్టణం సట్టా మట్కాకు అడ్డాగా మారింది. అడ్డూ అదుపు లేకుండా పట్టణంలోని వివిధ కాలనీల్లో ఓపెన్ సీక్రెట్‌గా సట్టా మట్కా జూదం విచ్చలవిడిగా సాగుతున్నది. అత్యాశతో కొందరు అమాయకులు జేబులు గుల్ల చేసుకుంటున్నారు. కొద్ది రోజులు క్రితం స్థానిక పోలీసులు అక్కడక్కడ దాడులు చేసి మట్కా జూదరులను పట్టుకున్నప్పటికీ అసలు సూత్రధారులను పట్టుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. చిన్నా చితక జూదరులను పట్టుకొని కేసు నమోదు చేయడం తప్పా బడా జూదరుల జోలికి పోలీసులు పోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. జూదరులు చిక్కినా పోలీసు స్టేషన్‌కు చేరకముందే ప్రజా ప్రతినిధుల నుంచి ఫోన్ రావడం, వారిపై పీటీ కేసు నమోదు చేసి వదిలేయడం శరమాములుగా మారింది. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడంతో మట్కా జూదాన్ని పోలీసులు పూర్తి స్థాయిలో కట్టడి చేయలేకపోతున్నారు. ఇటీవలే పోలీసులు మట్కా స్థావరాలపై దాడులు నిర్వహించి 30 మందిపై 15 కేసులు నమోదు చేసి, 20 సెల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నట్లు సమాచారం. కాగజ్‌నగర్ పట్టణంలోని తీరందాస్ టాకీస్ ఏరియా, రైల్వే స్టేషన్ రోడ్డు, సర్‌సిల్క్, రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద నిత్యం జూదరుల అడ్డగా మారింది. ఈ ప్రాంతంలో నిత్యం లక్షల రూపాయల మట్కా జూదం కొనసాగుతున్నది. ఉదయం 11 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు సట్టా మట్కా జూదం కొనసాగుతున్నది. రోజువారి కూలీ నుంచి ప్రభుత్వ ఉద్యోగులు సైతం సట్టా మట్కా జూదానికి బానిసయ్యారు. పండుగలు, ఆదివారాలు, సెలవు దినాల్లో తప్పా నిత్యం సట్టామట్కా నడుస్తున్నది. ఎంతో మంది జూదానికి అలవాటుపడి ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, ఈజ్‌గాం, చింతగూడ, రెబ్బెన, బెజ్జూర్, కౌటాల, మంచిర్యాల జిల్లాలోని తాండూర్‌తో పాటు పెద్దపల్లి జిల్లా రామగుండం, కరీంనగర్ జిల్లా చొప్పదండి, వరంగల్, బెల్లంపల్లి, తదితర ప్రాంతాల నుంచి కాగజ్‌నగర్‌కు వచ్చి సట్టా మట్కా ఆడుతున్నట్లు సమాచారం. పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకొని పట్టణంలో ఓపెన్ సీక్రెట్‌గా కొనసాగుతున్న మట్కాను ఇప్పటికైనా నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇటీవల పోలీసులు పట్టుకున్న సట్టా మట్కా జూదరులు (ఫైల్)

**ఆర్థికంగా ముంచుతున్న మట్కా**

కష్టపడకుండా డబ్బులు సంపాదించాలని అత్యాశతో కొందరు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓఎన్‌లో రూ.100 పెడితే రూ.1000, పానలో రూ.25 పెడితే రూ.3000, జోడిలో రూ.50 పెడితే 5000 సంపాదించవచ్చనే అత్యాశ యువతను ముంచుతున్నది. ఇలా ఎన్ని డబ్బులు పెడితే అంత ఎక్కువగా లాభం పొందవచ్చని తెలుపడంతో అత్యాశకు పోయి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఒకప్పుడు చీటీల ద్వారా నిర్వహించే సట్టా మట్కా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఆన్‌లైన్ ద్వారా కొనసాగిస్తున్నారు. గతంలో రైలు ద్వారా మహారాష్ట్రకు వెళ్లి మట్కా జూదం ఆడేవారు. ప్రస్తుతం గల్లీకో సట్టా మట్కా ఏజెంట్ తయారవడంతో కాగజ్‌నగర్ కేంద్రంగా జూదం కొనసాగిస్తున్నారు. యూట్యూబ్ చానల్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సోషల్ మీడియాను మట్కా జూదానికి వాడుకుంటున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో నిత్యం శ్రీదేవి, టైంబజార్, మిలన్ డే, రాజధాని, కల్యాణి సంస్థలు సట్టా మట్కా అధికంగా నిర్వహిస్తుంటాయి.

**మట్కా ఆడితే కఠిన చర్యలు**



కాగజ్‌నగర్ పట్టణంలో సట్టా మట్కా ఆడినా, ఆడించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. కాగజ్‌నగర్‌లో సట్టా మట్కా కట్టడి చేశాము. ఇటీవలే కొందరు జూదరులను పట్టుకొని కేసు నమోదు చేశాం. పట్టణంలో ఎక్కడైనా సట్టా మట్కా, పేకాట జూదం నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించాలి, వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

-శంకరయ్య, టౌన్ సీఐ కాగజ్‌నగర్

## సింగరేణి

## రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలి

- సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్
- ఆర్జీ - 3, ఏపీలో పర్యటన



ఆర్జీ - 3 ఓసీపీ - 2 ను సందర్శిస్తున్న సీఎండీ, అధికారులు

రామగిరి మార్చి 29 : నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించుకోవాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ అన్నారు. శుక్రవా రం రామగుండం-3 ఏరియాలోని ఓసీ-2 ఉపరితల గనిలో పర్యటించారు. దీనిలో భాగంగా ముందుగా వ్యూ పాయింట్ వద్ద ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపరితల గనిలో నడుస్తున్న మట్టి, బొగ్గు వెలికితీత పనులను పరిశీలించారు. క్వారీని సందర్శించారు. బేస్ వర్క్ షాప్‌లో గల పని స్థలాలు, యంత్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్‌లో జరుగుతున్న సీమ్-3, పంచ్ ఎంట్రీ పనులను పరిశీలించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించినందుకు ఆర్జీ-3 ఏరియా అధికారులు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. అలాగే సంస్థ నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను భద్రతతో సాధించుకోవడానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో వారితోపాటు డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) జీ వెంకటేశ్వరరెడ్డి, ఆర్జీ -3 జీఎం ఎన్ సుధాకర్‌రావు, ఏపీఏ జీఎం కే వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజినీర్లు పీ ఎలీషా, సీతారామం, ఎస్‌వోటూ జీఎంలు జీ రఘుపతి, బండి సత్యనారాయణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్.వెంకటరమణ, ప్రాజెక్టు ఇంజినీర్లు టీ.రఘురాం, ఎం నాగరాజు, మేనేజర్లు కేవీ రామారావు, తిరుపతి అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

## ఏప్రిల్‌లో అందుబాటులోకి మ్యాన్ రైడింగ్

- కాసిపేట-2 ఇంక్లైన్ గని మేనేజర్ లక్ష్మీ నారాయణ
- మ్యాన్ రైడింగ్ రోప్ పనులు ప్రారంభం



గనిపై రోప్ పనులు ప్రారంభిస్తున్న మేనేజర్ లక్ష్మీనారాయణ


కాసిపేట, మార్చి 29 : ఏప్రిల్‌లో కార్మికులకు మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి వస్తుందని కాసిపేట 2 గని మేనేజర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట -2 ఇంక్లైన్ గనిపై మ్యాన్ రైడింగ్ రోప్ పనులను గని మేనేజర్ లక్ష్మీ నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ వీలైనంత త్వరగా మ్యాన్ రైడింగ్ ప్రారంభించాలని, కార్మికుల రక్షణ దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ మ్యాన్ రైడింగ్ పూర్తి దశకు చేరుతున్నాయన్నారు. మ్యాన్ రైడింగ్‌తో హాజరు శాతం కూడా పెరిగే అవకాశం ఉందని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంజినీర్ల పర్యవేక్షణలో మ్యాన్ రైడింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఏప్రిల్‌లో మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి వస్తుందని చెప్పడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌రావు, ఇంజినీర్ రఘు, కృష్ణ ప్రసాద్, ఐఎన్టీయూసీ నాయకులు కారుకూరి తిరుపతి, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గోళ్ల శ్రీనివాస్, ఓవర్‌మన్ సెగ్గం శ్రీనివాస్, సుభాష్‌చంద్రబోస్, సర్దార్ కొత్తపల్లి శంకరయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## ఉత్పత్తి లక్ష్యం సాధించిన ఆర్కే న్యూటెక్

- కార్మికులు, అధికారులను అభినందించిన గని మేనేజర్

శ్రీరాంపూర్, మార్చి 29 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే న్యూటెక్ గనికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రెండు రోజుల ముందే శుక్రవారం సాధించారు. యాజమాన్యం గనికి నిర్దేశించిన ఉత్పత్తి 1.60 లక్షల టన్నులను శుక్రవారంతో 100 శాతం సాధించినట్లు మేనేజర్ స్వామిరాజు పేర్కొన్నారు. గనిపై మేనేజర్ స్వామిరాజు ఆధ్వర్యంలో కార్మికులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ కార్మికులకు స్వీట్లు పంచి పెట్టారు. ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేసిన కార్మికులు, అధికారులు, సూపర్‌వైజర్లను అభినందించారు.

## హెల్త్ డిపార్ట్‌మెంట్ పిట్ కమిటీ ఎన్నిక



డీవైసీఎంవోకు పిట్ కమిటీ వివరాలు అందిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 29 : శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ డిపార్ట్‌మెంట్ గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ పిట్ కమిటీని నియమించి ఇందుకు సంబంధించిన వివరాలను డీవైసీఎంవో రమేశ్‌బాబుకు అందించారు. ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా ఆధ్వర్యంలో పిట్ కమిటీని ఎన్నుకున్నారు. పిట్ కార్యదర్శిగా విజయలక్ష్మి, సహాయ కార్యదర్శిగా బోయిన రమణ, సంయుక్త కార్యదర్శిగా జీ శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కే తిరుపతి, కోశాధికారిగా ముద్దసాని మల్లేశ్, అరుణకుమారి, విజయ, మంజుల, నాగేంద్రవర్మ, లింగమూర్తిని నియమించారు. అనంతరం డీవైసీఎం రమేశ్‌బాబును కలిసి హెల్త్ డిపార్ట్‌మెంట్ సమస్యలు పరిష్కరించాలని, పిట్ కమిటీ ద్వారా చర్చలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

## హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి

గోదావరిఖని,మార్చి 29: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సింగరేణి సీఎండీని కలిసి వినతి పత్రం అందజేశారు. జీవో నం. 94ను రద్దు చేయించి జీవో నం. 22 అమలు చేయించేలా ప్రభుత్వంతో మాట్లాడాలని, కోలిండియా మాదిరిగా 8 రాష్ట్రాల్లో జీతభత్యాలు, హక్కులు కల్పిస్తున్నారో సింగరేణిలో కూడా కాంట్రాక్ట్ కార్మికులకు హైపవ్ కమిటీ వేతనా లు అమలు చేయాలని విన్నవించారు. కాంట్రాక్ట్ కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వమైనా న్యాయం చేస్తుందని ఆశా భావం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.